సాక్షి
బాపట్ల
సోమవారం । 2 । సెప్టెంబర్ । 2024





## ఘనంగా అంకాలమ్మ బోనాలు


వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఇందిరా నగర్‌కు చెందిన వడియరాజుల సంఘం ఆధ్వర్యంలో అంకాలమ్మ బోనాల వేడుక ఆదివారం వైభవంగా నిర్వహించారు.



## సామూహిక కుంకుమార్చన

చెరుకుపల్లి: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని గుళ్లపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం సామూహిక కుంకుమార్చన అత్యంత వైభవంగా జరిగింది.

## మహాలక్ష్మిగా చందోలు బండ్లమ్మ



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో కొలువై ఉన్న బండ్లమ్మ వారి దేవాలయంలో శ్రావణమాసం ఆఖరి ఆదివారం సందర్భంగా అమ్మవారిని మహాలక్ష్మి స్వరూపంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## న్యూస్‌రీల్

### వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

డీఎంహెచ్‌వో ఎస్.విజయమ్మ



బాపట్ల: జిల్లాలో మారిన వాతావరణ పరిస్థితులు, భారీ వానలు కురుస్తున్న నేపథ్యంలో వేగంగా డయేరియా, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారిణి డాక్టరు ఎస్.విజయమ్మ పేర్కొన్నారు. ఈ మేరకు సంబంధిత విషయాలను ఆదివారం ఆమె మీడియాకు వివరించారు. కాచి చల్లార్చిన నీరు, క్లోరిన్ కలిపిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. కాలకృత్యాలు తీర్చుకున్నాక కూడా సబ్బును ఉపయోగించి చేతులు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. ఈగలు వాలిన ఆహార పదార్థాలు, నిల్వ ఉన్నవి భుజించరాదని చెప్పారు. సాధ్యమైనంత వరకు బయటి ఆహారం తీసుకోవద్దన్నారు. ఇంటిలోపల, బయట పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే సమీపంలోని వైద్య ఆరోగ్య సిబ్బంది, ప్రాథమిక ఆసుపత్రి, పట్టణ ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని కోరారు. సకాలంలో తగిన వైద్య సహాయాన్ని పొందాలని చెప్పారు. అత్యవసర సమయంలో ఎస్.రవిరాజు కుమార్ – 95150 23769, పి.ప్రభాకరరావు – 77299 38778, టి. శ్రీనివాసులు - 81214 82433, కంట్రోల్ రూము – 73822 39650 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

బాపట్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం తాత్కాలికంగా రద్దు చేశామని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కృష్ణా నదిలో వరద ఉధృతి పెరిగిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్, ఇతర అధికారులందరూ సంబంధిత చర్యలలో నిమగ్నమై ఉన్నందున ఇలా రద్దు చేశామన్నారు. జిల్లాలోని ప్రజలు ఈ విషయాన్ని గమనించి సోమవారం రావద్దని కలెక్టరేట్‌కు రావద్దని ఆయన కోరారు.

### పలు రైళ్లు రద్దు



లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సోమవారం పలు రైళ్లను రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. రైలు నంబర్ 07464 (విజయవాడ-గుంటూరు), 07465 (గుంటూరు-విజయవాడ), 07755 (డోర్నకల్-విజయవాడ), 07756 (విజయవాడ-డోర్నకల్) మీదుగా రైళ్లను రద్దు చేసినట్లు తెలిపారు. 17201 (గుంటూరు-సికింద్రాబాద్) 17202 (సికింద్రాబాద్-గుంటూరు), 12705 (గుంటూరు-సికింద్రాబాద్), 12706 (సికింద్రాబాద్-గుంటూరు) రైళ్లను కూడా సోమవారం రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ధర్మవరం-మచిలీపట్నం(17216) రైలు, లింగంపల్లి-నరసాపూర్ (17256) రైలు సోమవారం రద్దు చేశారు. విజయవాడ-గుంటూరు (07783), గుంటూరు- విజయవాడ(07779), మాచర్ల- నడికుడి(07580), నడికుడి- మాచర్ల (07579), మాచర్ల-గుంటూరు(07780), గుంటూరు- విజయవాడ (07788), కాచిగూడ- మిర్యాలగూడ (07276), మిర్యాలగూడ -నడికుడి (07277), నడికుడి- మిర్యాలగూడ (07973), మిర్యాలగూడ-నడికుడి (07974) రైళ్ల సోమ, మంగళ వారాలలో రద్దు చేసినట్లు తెలిపారు.

### వీఆర్‌కు పట్టాభిపురం ఎస్‌హెచ్‌వో కిరణ్

పట్నంబజారు: గుంటూరు వెస్ట్ సబ్‌డివిజన్ పరిధిలోని పట్టాభిపురం పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వర్తిస్తున్న పి.కిరణ్‌ను వీఆర్‌కు పంపుతూ పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల కాలంలో జరిగిన ఒక సివిల్ వివాదంలో ఎస్‌హెచ్‌వో కిరణ్ ఏకపక్షంగా వ్యవహరించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనితోపాటు కమ్మా వెంకట్రావు, ఆయన కుమారుడు హరికృష్ణలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిన విషయంలో ఇష్టానుసారంగా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో కిరణ్‌ను వీఆర్‌కు పంపుతూ ఆదేశాలు జారీ అయ్యాయి.

# కృష్ణా ఉగ్రరూపం.. అంతా అప్రమత్తం

- పెరుగుతున్న వరదతో పరీవాహక ప్రాంతాల్లో భయం భయం
- ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్న అధికార యంత్రాంగం
- ముంపులో చిక్కుకున్న పెనుమూడి పల్లెపాలెం వాసులు



పెనుమూడి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ



వరద నీటిలో అభయాంజనేయ స్వామి ఆలయం

రేపల్లె రూరల్: కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. పెనుమూడి పల్లెపాలెంను వరద నీరు ముంచెత్తింది. నదిలో వరద ప్రవాహం ఆదివారం సాయంత్రం నుంచి అంతకంతకు పెరుగుతూ ప్రమాదకర స్థాయికి చేరుకుంటోంది. ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు భారీగా నీరు విడుదల అవుతోంది. దీంతో కృష్ణానది పరీవాహక ప్రాంతాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. వరద ప్రవాహం ఇంకా పెరిగే అవకాశం ఉండటం, కృష్ణా కరకట్ట బలహీనంగా మారడంతో కోతకు గురయ్యే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యగా బలహీనంగా ఉన్న ప్రదేశాలను గుర్తించి జాగ్రత్తలు చేపడుతున్నారు.

### నాటి ప్రమాదకర స్థాయిని గుర్తుచేస్తూ...

2009 అక్టోబర్ నెలలో ఓలేరు పల్లెపాలెం వద్ద గండి పడటంతో కృష్ణమ్మ రేపల్లె పట్టణాన్ని ముంచెత్తింది. నాడు 10.86 లక్షల క్యూసెక్కుల వరద నీటి విడుదలతో పట్టణమంతా మునిగిపోయింది. వరద ప్రభావంతో వారం రోజులకుపైగా ప్రజలు పడిన ఇబ్బందులు ఎన్నో. ప్రస్తుతం కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చడం, ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదలవుతున్న నీరు 10 లక్షల క్యూసెక్కులు దాటడంతో ఎక్కడ గండి పడి ప్రమాదం ముంచుకొస్తుందోనని ఈ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

### పెనుమూడి పల్లెపాలెం వాసుల అవస్థలు

పెనుమూడి పల్లెపాలెం గ్రామాన్ని వరద నీరు ముంచెత్తటంతో 150 కుటుంబాలను రెవెన్యూ, పోలీసు, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది ప్రత్యేక పడవలలో పునరావాస కేంద్రాలకు తరలించారు. పెనుమూడి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు పంపారు. వసతి, భోజనం ఏర్పాట్లు చేశారు. రెవెన్యూ, పోలీస్, సచివాలయ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో వసంత రాయుడు

### వేటకు వెళ్లొద్దని జాలర్లకు హెచ్చరిక

వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మత్స్యకారులు నదిలోకి వేటకు వెళ్లవద్దని జడ్పీ సీఈవో వసంతరాయుడు చెప్పారు. కృష్ణా జిల్లా లంక గ్రామాలకు పడవ ప్రయాణాలు చేయకుండా పటిష్ట చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నదిలోకి సందర్శకులు వెళ్లకుండా సంబంధిత అధికారులను అప్రమత్తం చేసినట్లు చెప్పారు. పశువులను మేపేందుకు లంక గ్రామాలలోకి ఎవ్వరూ వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. మత్స్యకారులను వేటకు వెళ్లకుండా అధికారులు పర్యవేక్షిస్తూ ఉండాలని చెప్పారు. అధికారులు పెనుమూడి వద్ద వరద ఉధృతిని పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలని పేర్కొన్నారు. నది వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామని వెల్లడించారు. అత్యవసర సేవలు అందించేందుకు 15 మంది ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పునరావాస కేంద్రాలకు వచ్చే ప్రజలకు భోజన, తాగునీటి వసతి కల్పించాలన్నారు. మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి అవసరమైన మందులను అందించాలని పేర్కొన్నారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారులు పానకాల రావు, చంద్రశేఖర రావు, తహసీల్దార్ ఎం.శ్రీనివాస రావు, ఎంపీడీవో శివపార్వతి ఉన్నారు.

### పెనుమూడి రేవు వద్ద పరిస్థితి పరిశీలన

ముంపు ప్రాంతాల్లోని ప్రజలు స్వచ్ఛందంగా సురక్షిత ప్రదేశాలకు తరలివెళ్లాలని బాపట్ల జిల్లా అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ కోరారు. పెనుమూడి రేవులో వరద పరిస్థితిని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అత్యవసరం అయితేనే ప్రజలు బయటకు రావాలని, జాగ్రత్తలు పాటించాలన్నారు.

## ఊపిరి పీల్చుకున్న రావిలంక వాసులు

జిల్లా కలెక్టర్ వెంకట మురళి చొరవ ఫలితం



ప్రజలను బోటులో తరలిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

కొల్లూరు: నది మధ్యలో చిక్కుకుపోయిన ప్రజలను 'సాక్షి' చొరవతో అధికారులు సురక్షిత ప్రాంతానికి తరలించారు. కృష్ణా నదికి వరద ఉధృతి పెరగడంతో రెండ్రోజులుగా బాపట్ల జిల్లా కొల్లూరు మండలం పోతార్లంక శివారు రావిలంకలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే సుమారు 25 నుంచి 30 మంది చిక్కుకుపోయారు. ఆదివారం 'సాక్షి'లో 'నది మధ్యలోనే చిక్కుకుపోయిన రావిలంక వాసులు' శీర్షికన కథనం వెలువడింది. శనివారం అర్ధరాత్రి 'సాక్షి' ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ వెంకట మురళి దృష్టికి తీసుకెళ్లింది. ఆయన కొల్లూరు తహసీల్దార్ వెంకటేశ్వర్లును ప్రశ్నించగా తరలించామని కలెక్టర్‌కు బదులిచ్చారు. అయితే ఆదివారం సైతం రావిలంక వాసులు నది మధ్యలోనే ఉన్నారు. నివాస ప్రాంతాల వద్దకు వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వారు సురక్షితంగా ఉన్నారా.. అని ఫోన్‌లో 'సాక్షి' ఆరా తీయడంతో తమను పట్టించుకున్న నాథుడు లేరని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కలెక్టర్ వెంకట మురళి దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లడంతో ఆయన స్పందించారు. అక్కడి ప్రజలతో నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. చిక్కుకున్న వారు కృష్ణా జిల్లాకు చెందిన వ్యక్తులు కావడంతో ఆ జిల్లా కలెక్టర్‌తో సైతం వెంకట మురళి ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. అప్రమత్తమై కొల్లూరు రెవెన్యూ సిబ్బందిని పంపి అందుబాటులో ఉన్న పడవల ద్వారా ప్రజలను కృష్ణా జిల్లాకు సురక్షితంగా తరలించారు. జిల్లా కలెక్టర్ వెంకట మురళి చొరవతో రావిలంక వాసులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.






పెనుమూడి పల్లెపాలెం గ్రామం నుంచి సురక్షిత ప్రాంతాలకు గ్రామస్తుల తరలింపు

## ప్రాణనష్టం లేకుండా చూడాలి

జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి

కొల్లూరు: కృష్ణా వరదల కారణంగా తీర ప్రాంత గ్రామాలలో ఎటువంటి ప్రాణ నష్టం వాటిల్లకుండా ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా వ్యహరించాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులను ఆదేశించారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆయన కొల్లూరు మండలంలోని చిలుమూరులంక, ఈపూరులంక, పెసర్లంక, ఆవులవారిపాలెం తదితర గ్రామాలలో పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేసే పనిలో తలమునకలయ్యారు. ఆదివారం చిలుమూరులంకలో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఆయన జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, జిల్లా ప్రత్యేక అధికారి శేషగిరిబాబులతో కలసి ఆ గ్రామ ప్రజలతో సమావేశమయ్యారు. అనంతరం కొల్లూరు మండల పరిషత్తు కార్యాలయంలో అధికారులుతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఆయన ప్రభుత్వ శాఖల సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. కొల్లూరు నుంచి పెనుమూడి వరకు 40 పడవల ద్వారా ప్రజలు తరలించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. గ్రామాలలో తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వైద్య శిబ్బంది శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసులు తగిన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ సిబ్బందిని ఆదేశించారు. వరద పరిస్థితిపై వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, బాపట్ల ఎంపీ తేనేటి కృష్ణప్రసాద్‌లతో కలెక్టర్ చర్చించారు. వరద ప్రభావిత లంక గ్రామాలలో మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే ఆనందబాబులు పర్యటించారు. అక్కడ వరద పరిస్థితిని పరిశీలించారు.



పెనుమూడి పునరావాస కేంద్రంలోని ప్రజలకు భోజనం అందిస్తున్న జిల్లా కలెక్టర్ తదితరులు



లంక గ్రామాలలో పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

### పునరావాస కేంద్రాలలో సురక్షితంగా ఉండండి

రేపల్లె రూరల్: వరద ముంపు తగ్గేంత వరకు పునరావాస కేంద్రంలో ప్రజలు సురక్షితంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి సూచించారు. ఆదివారం రాత్రి పెనుమూడి వద్ద కృష్ణమ్మ వరద ఉధృతిని ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రకాశం బ్యారేజీ నుంచి వరద నీరు భారీగా కిందికి వస్తోందన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే అధికారులను అప్రమత్తం చేశామన్నారు. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ప్రాణ నష్టం జరగకుండా ప్రజలు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఆర్డీవో హెలా షారోన్, టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్, తదితరులు ఉన్నారు.

## నేడు పాఠశాలలు, కళాశాలలకు సెలవు

భారీ వర్షాల దృష్ట్యా ప్రభుత్వం ఆదేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: భారీ వర్షాల దృష్ట్యా ప్రభుత్వ ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ ఆదివారం తెలిపారు. అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలు విద్యార్థులకు విధిగా సెలవు ప్రకటించాలని ఆమె ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు ఆర్‌ఐవో జీకే జుబేర్ తెలిపారు. విద్యార్థులకు తరగతులు నిర్వహించరాదని ఆయన స్పష్టం చేశారు.

## భయం గుప్పెట్లో లంక గ్రామాలు

- పునరావాస కేంద్రాలకు వెళ్లని ప్రజలు
- పూర్తిగా నిలిచిపోయిన రాకపోకలు
- వాణిజ్య పంటలకు తీవ్ర నష్టం
- పలు నివాసాల్లోకి చేరిన వరద నీరు



పెసర్లంక అరవింద వారధి ఎగువన కృష్ణా నది గండికి వేసిన అడ్డుకట్ట కోతకు గురైన దృశ్యం



పెసర్లంక అరవింద వారధి అడుగు భాగానికి తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ

కొల్లూరు : కృష్ణమ్మ ఉధృతికి లంక గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఆదివారం ప్రకాశం బ్యారేజీ నుంచి భారీగా నీటిని దిగువకు విడుదల చేయడంతో వరద నీరు నివాసాలు, పొలాల్లోకి చొచ్చుకొని వస్తోంది. మండలంలోని పెసర్లంక అరవింద వారధి ఎగువన నది అంచున గతంలో ఏర్పడిన గండి నుంచి కొల్లూరు కరకట్ట వైపు భూముల్లోకి నీరు రాకుండా ఏర్పాటు చేసిన అడ్డుకట్ట కోతకు గురైంది. దీంతో నదిలోని నీరు మొత్తం గ్రామాల వైపు దూసుకెళ్లింది. నిమిషాల వ్యవధిలోనే కొల్లూరు కరకట్ట వద్దకు వరద నీరు చేరుకొని పెసర్లంక, ఆవులవారిపాలెం గ్రామాలను చుట్టుముట్టింది. పల్లపు ప్రాంతాలలోకి చేరుకున్న నీరు కొల్లూరు నుంచి పెసర్లంక, గాజుల్లంక, ఆవులవారిపాలెం, పెదలంక, చింతర్లంక, ఈపూరులంక, సుగ్గునలంక, చిలుమూరులంక, గుంటూరు, కృష్ణా జిల్లా గ్రామాలైన అన్నవరపులంక, కొత్తూరులంక, కనిగిరిలంక, మునగపల్లిలంక గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపైకి చేరుకుంది. ఉధృతంగా ప్రవహిస్తుండటంతో లంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని దోనేపూడి కరకట్ట దిగువన ఉన్న లో లెవల్ వంతెనపైనుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతోపాటు భట్టిప్రోలు మండలం వెల్లటూరు వద్ద రహదారిపై నుంచి కూడా వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో భట్టిప్రోలు, కొల్లూరు మండలాలల్లోని పోతార్లంక, తిప్పలకట్ట, కిష్కిందపాలెం, తురకపాలెం, తోకలవారిపాలెం, కృష్ణానగర్, జువ్వలపాలెం, తడికలపూడి, చింతమోటు, పెసర్లంక, పెదలంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామాల నడుమ అంతర్గత రోడ్లు సైతం ముంపునకు గురవడంతో రాకపోకలు ఆగిపోయాయి. సాగులో ఉన్న పసుపు, కంద, అరటి, తమలపాకు, బొప్పాయి, జామ, కూరగాయల పంటలు ముంపు బారినపడటంతో రైతులకు కోలుకోలేని నష్టం వాటిల్లింది. పల్లపు ప్రాంతాలలోని జనావాసాల్లోకి నీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలను ముందస్తు హెచ్చరికలు లేకుండానే పునరావాస కేంద్రాలకు తరలిరావాలని అధికారులు హడావిడి చేయడంతో ప్రయోజనం లేకపోయింది. జిల్లా కలెక్టర్ వెంకట మురళి, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, జిల్లా ప్రత్యేకాధికారి శేషగిరిబాబులు చిలుమూరులంకలో ఉండి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. ఆటోలలో తరలించినప్పటికీ వారు పునరావాస కేంద్రాలకు మాత్రం చేరలేదు. మండలంలోని నదీ తీర గ్రామాలలో సుమారు 5 వేల కుటుంబాలలోని 15,500 మంది ఇంకా అక్కడే ఉన్నారు. వారికోసం ప్రభుత్వాధికారులు కేవలం బియ్యం మాత్రమే తరలించారు. కొల్లూరులో 3 చోట్ల, చిలుమూరు, దోనేపూడి, భట్టిప్రోలు మండలం వెల్లటూరులో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో ముగ్గురే చేరారు. అవసరానికి 20 పడవలను సిద్ధంగా ఉంచారు.



కొల్లూరు నుంచి పది లంక గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై వరద నీటి ప్రవాహం



సుగ్గునలంక వద్ద ముంపునకు గురైన తోట నుంచి అరటి గెలలు మోసుకొస్తున్న రైతులు



పెసర్లంక రామన్నపేటలో ఓ ఇంటి చుట్టూ చేరిన వరద నీరు

## క్లుప్తంగా

### బాలికల ఆరోగ్యంపై జాగ్రత్త



చినగంజాం: బాలికల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ కలెక్టర్, బాలిక విద్య ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ చిలుకూరి లక్ష్మీ కుమారి అన్నారు. ఆదివారం స్థానిక కస్తూర్బా బాలికా విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. విద్యాలయంలోని బాలికలకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రస్తుతం సీజన్‌లో వర్షాలు కురుస్తున్న కారణంగా వ్యాధులు విపరీతంగా ప్రబలుతున్న దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం విద్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జీసీడీఓ చారులత, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుకన్య పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



కర్లపాలెం: లారీ, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇరువురికి గాయాలయ్యాయి. కర్లపాలెం ఎస్ఐ ఎస్.రవీంద్ర తెలిపిన వివరాల మేరకు... కర్లపాలెంకు చెందిన గాజుల బాల వెంకట అమర్‌నాథ్ (25), ఎస్‌కే జిలానీ, ఉదయ్‌లు స్నేహితులు. ఆదివారం సాయంత్రం వీరు బాపట్ల నుంచి ద్విచక్ర వాహనంపై కర్లపాలెం వస్తున్నారు. అదే సమయంలో ఎంవీరాజుపాలెం సమీపంలోని హెచ్‌జేబీ డిగ్రీ కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై లారీ వస్తోంది. రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. బాల వెంకట అమర్‌నాథ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌కే జిలానీ, ఉదయ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సమీపంలోని ఉన్న ఎస్ఐ వచ్చి తన వాహనంలో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

### కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య

ప్రత్తిపాడు: కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రత్తిపాడు మండలం చినకోండ్రుపాడు గ్రామానికి చెందిన శ్రీ దుర్గ (24)కు 2018లో అదే గ్రామానికి చెందిన కన్నా శ్రీనివాసరావుతో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే కొన్ని నెలలుగా శ్రీదుర్గ తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ గుంటూరులోని ప్రైవేటు హాస్పిటల్లో చికిత్స పొందుతోంది. అయినప్పటికీ తగ్గకపోవడంతో జీవితం మీద విరక్తి చెందింది. గత నెల 31వ తేదీ రాత్రి ఇంట్లో చీరతో సీలింగ్ ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు మృతురాలి తల్లి మణిమేల అంజమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తీరం మరువని చిరునవ్వు..!

- ప్రజల మదిలో నాటి వైఎస్సార్ పర్యటన
- నేడు వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి

రేపల్లె రూరల్: తీర ప్రాంత ప్రజల హృదయాల్లో మహా నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చిరునవ్వులు చిరస్థాయిగా నిలిచిపోయాయి. ముఖ్యమంత్రిగా ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, రైతు రుణమాఫీ, 108, రైతులు, డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు పావలా వడ్డీ రుణాలు అందించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి తీరప్రాంత ప్రజలు బ్రహ్మరథం పట్టి పూల వర్షంతో స్వాగతం పలికారు. 2009 జనవరి 28వ తేదీన అప్పటి కూచినపూడి, రేపల్లె నియోజకవర్గాలలో పర్యటించిన సందర్భంగా ప్రజలు ఆయనపై పూలవర్షం కురిపించి తమ ప్రేమను చాటుకున్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్సార్ బాధ్యతలు చేపట్టిన అనంతరం మూడు సార్లు ఈ ప్రాంతంలో పర్యటించారు. తీరప్రాంతంపై తనకున్న మక్కువను చాటుకున్నారు. నియోజకవర్గంలో ఆయన పేరుపెట్టి పిలిచే నాయకులు పదుల సంఖ్యలో ఉన్నారంటే వైఎస్సార్‌కు ఆ ప్రాంతంతో ఉన్న అనుబంధాన్ని తెలుసుకోవచ్చు. ప్రతి ఒక్కరిని చిరునవ్వుతో ఆప్యాయంగా పలుకరించే వైఎస్సార్ రచ్చబండ కార్యక్రమానికి వెళ్లడానికి ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కనిపించకుండా పోయిందని తెలియటంతో ఒక్కసారిగా ఇక్కడి ప్రజలు ఆందోళనకు గురయ్యారు. మహానేత క్షేమంగా ఉండాలంటూ దేవాలయాలు, మసీదులు, చర్చిలలో పూజలు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇంతలోనే ప్రమాదానికి గురై వైఎస్సార్ ఇక లేరని తెలియడం ప్రజలను శోకసముద్రంలో ముంచింది. ఆ మహనీయునికి ఈ నెల 2వ తేదీన ఘనంగా నివాళులు అర్పించేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, ప్రజలు సిద్ధమవుతున్నారు.



నిజాంపట్నంలో జననేతపై పూలవర్షం కురిపిస్తూ ప్రేమను చాటుకున్న ప్రజలు (ఫైల్)



నిజాంపట్నంలో సునామీ అనంతరం నిర్మించిన పేదల గృహాలను ప్రారంభిస్తున్న వైఎస్సార్ (ఫైల్)



నగరంలో డ్వాక్రా మహిళలకు చెక్కు అందిస్తున్న వైఎస్ రాజశేఖరరెడ్డి (ఫైల్)

# వసంతరావుది హత్యేనని అనుమానాలు

**బంధువుల ఆందోళన**

- చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రి సమీపంలో రాస్తారోకో
- నిష్పక్షపాతంగా విచారణ చేయాలని డిమాండ్
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు

చిలకలూరిపేట: ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడితే, రక్తపు మడుగులో ఎందుకు పడి ఉంటాడని, కారసాల వసంతరావుది ఆత్మహత్య కాదు... హత్యేనంటూ మృతుడి భార్య, బంధువులు ఆందోళనకు దిగారు. చిలకలూరిపేటలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాల ముందు చీరాల రోడ్డులో ఆదివారం బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు. చిలకలూరిపేట పట్టణంలోని దాసరి కాలనీలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న వసంతరావు మృతదేహం అదే ఆసుపత్రిలో శనివారం గుర్తించారు. ఆసుపత్రి వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు శుక్రవారం సాయంత్రం విధులు ముగిసి, వైద్య సిబ్బంది వెళ్లిపోయాక లోపలి వైపు నుంచి తలుపులు వేసుకొని ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు చెబుతున్నారు. శనివారం ఉదయం 10 గంటల తర్వాత ఆసుపత్రి సిబ్బంది వచ్చి తలుపులు తెరిచి చూడగా సీలింగ్‌ఫ్యానుకు తాడు కట్టి ఉంది. వసంతరావు నేలపై తలకు గాయాలతో పడి ఉన్నాడు. ఈ నేపథ్యంలో ఆసుపత్రి సిబ్బంది వసంతరావు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి చేరుకొన్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



ఆందోళన నిర్వహిస్తున్న వారితో చర్చిస్తున్న అర్బన్ సీఐ రమేష్

**ఆసుపత్రి ముందు బంధువుల ధర్నా...**

వసంతరావు మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని, ఆసుపత్రి వైద్యుడు, సిబ్బంది ఆయనను గత కొంతకాలంగా తీవ్రంగా వేధిస్తున్నారని మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆదివారం ఆందోళనకు దిగారు. ఏరియా ఆసుపత్రి ముందు చీరాల రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. వసంతరావుది ఆత్మహత్య కాదని, హత్య అని ఆరోపించారు. ఈ విషయమై పూర్తిస్థాయిలో జిల్లా అధికారులతో విచారణ నిర్వహించి, అర్బన్ సీఐ పి.రమేష్ వారికి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అయినా బాధితులు ఆందోళన విరమించలేదు. దీంతో చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బనాయుడు, నరసరావుపేట పోలీసు అధికారులతో పాటు సిబ్బంది చేరుకున్నారు. మరోమారు అర్బన్ సీఐ రమేష్ వారితో మాట్లాడారు. వసంతరావు మృతి విషయమై పారదర్శకంగా విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన విషయాలు డీఎంహెచ్ఓ వచ్చి అనుమానాలు నివృత్తి చేస్తారని నచ్చచెప్పడంతో ఆందోళన విరమించారు.

**డీఎంహెచ్ఓ చర్చలు...**

డీఎంహెచ్‌వో డాక్టర్ రవి ఏరియా ఆసుపత్రికి చేరుకొని మృతుడి భార్య శిరీషా, బంధువులతో చర్చలు జరిపారు. మృతుడి ఇద్దరు పిల్లలకు పదోతరగతి వరకు రెసిడెన్షియల్ పాఠశాలలో ఉచిత విద్య ఏర్పాటు చేస్తామని, భార్యకు ఉద్యోగం కల్పిస్తామని తెలిపారు. అయితే మృతికి నష్టపరిహారం చెల్లించాలని మృతుడి బంధువులు డిమాండ్ చేశారు. దీంతో డీఎంహెచ్‌వో ఫోన్‌లో జిల్లా కలెక్టర్‌తో సంప్రదించి పరిహారం విషయం ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

## పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

వేమూరు(అమర్తలూరు): పంట నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని వేమూరు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు డిమాండ్ చేశారు. అమర్తలూరు మండలంలోని ప్యాపర్రు, బోడపాడు పంట పొలాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తుపాన్ వల్ల కురిసిన భారీ వర్షాలకు పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయని పేర్కొన్నారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో పంట నష్టపోయిన అన్నదాతలకు పరిహారం వెంటనే అందించిన విషయాన్ని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం రైతు భరోసా నిధులు కూడా ఇవ్వలేదన్నారు. పంట నష్ట పరిహారమైనా చెల్లిస్తుందా.. లేదా? అనేది అర్థం కావడం లేదన్నారు. వరద ఉధృతమై గ్రామాల్లోకి నీరు చేరిందన్నారు. ప్రజలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తగిన సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు. పంట నష్టం వెంటనే అంచనా వేయాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇలాంటి సమయాల్లో తగిన సాయం వెంటనే అందించారని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



ప్యాపర్రు గ్రామంలో నీట మునిగిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న వరికూటి అశోక్‌బాబు

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

**ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివరావు**

చీరాల అర్బన్: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బుర్రా సాంబశివరావు అన్నారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ చీరాల జోన్ ఆధ్వర్యంలో సీపీఎస్ విధానంపై నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ... సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు జరుగుతున్న నష్టాన్ని గమనించి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పేర్కొన్నారు. కాంట్రిబ్యూషన్ లెక్కల వివరాలను ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని కోరారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఆదినారాయణ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యూపీఎస్ విధానం కూడా లోపభూయిష్టంగానే ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ వేటపాలెం మండల అధ్యక్షులు సరళకుమారి, చీరాల మండల ప్రధాన కార్యదర్శి జి.నాగమల్లేశ్వరరావు, చేజర్ల శ్రీనివాసరావు, టీవీ ప్రతాప్, ఆలూరి శ్రీనివాసరావు, జీఏవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

## పాఠశాల ప్రాంగణంలో కూలిన పాత పెంకుటిల్లు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరు జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలోని పాత పెంకుటిల్లు శనివారం సాయంత్రం కుప్పకూలింది. భారీ వర్షం కురుస్తుండంతో పాఠశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఈ తరుణంలో పెంకుటిల్లు పైకప్పు కూలడంతో ప్రమాదం తప్పింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ఇది ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. తొలగించాలని విద్యాశాఖాధికారులకు హైస్కూల్ హెచ్ఎం ఇప్పటికే ఎన్నోమార్లు తెలిపారు.



భట్టిప్రోలు మండలం వెల్లటూరు హైస్కూల్‌లో కుప్పకూలిన పాత పెంకుటిల్లు

## ఫుట్‌బాల్ సీనియర్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన సీనియర్ పురుషుల, మహిళల జట్లతో సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎస్‌కే ఎండీ రియాజ్

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సీనియర్స్ పురుషుల, మహిళల ఫుట్‌బాల్ జిల్లా ఎంపికలు నిర్వహించారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారిణులు వచ్చే నెల నుంచి గుంటూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు అని పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. పురుషుల జట్టు వచ్చే నెల నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. జట్ల ఎంపికలో పీడీలు ఎస్‌కే ఎండీ రియాజ్, ఐఎస్ నాగిరెడ్డి, ఎ.శ్రీరామ్, శ్రీనివాసరావు, రెడ్డి, ఎస్ఎం సుభాని, సత్యవతి, అచ్చిరెడ్డి, నరసింహారావు, అనిల్, జాన్ సైదా తదితరులు పాల్గొన్నారు. మహిళల జట్టు: జై.మహేశ్వరి (మాధల), ఎం.మహేశ్వరి, ఆర్.కావ్యలక్ష్మి, ప్రసన్న(రామకృష్ణాపురం), ఆర్.పుష్పలత (మాదల), ఎస్.శ్రావణి (ఇరుకు పాలెం), షరీన్ (మాదల), ఎస్.శ్రావ్య (మాదల), బి.చంద్రిక (సత్తెనపల్లి), బి.అశ్విని, సిహెచ్ వెంకట ప్రియ (రామకృష్ణాపురం), శ్వేత (సత్తెనపల్లి), కె.త్రివేణి (సత్తెనపల్లి), ఎం.హర్షిత (ముప్పాళ్ళ), అలేఖ్య (సత్తెనపల్లి), ప్రవల్లిక (సత్తెనపల్లి), బి.సాయి (కొమరెపూడి), గాయత్రి, సౌజన్య (సత్తెనపల్లి), ఎస్.మంజుల (సత్తెనపల్లి), ఎస్.మౌనిక (సత్తెనపల్లి), పి.విజయలక్ష్మి (దూళిపాళ్ల), పి.ప్రత్యూష (దూళిపాళ్ల)

పురుషుల జట్టు: చింతలపూడి రాజు (మాదల), శ్యామ్‌కుమారు (మాదల), టి.కల్యాణ్‌రామ్ (మాదల), అంకమ్మరావు (మాదల), కె.శ్రీనివాసరావు, సీహెచ్ రాజు (మాదల), ప్రదీప్ (మాదల), ఎం.బాబురావు, సీహెచ్ సాకేత్ (సత్తెనపల్లి), ఎం.షరీఫ్ (సత్తెనపల్లి), కె.ఆకాష్ (సత్తెనపల్లి ), ఎండీ రఫీ (సత్తెనపల్లి), కె.నరేష్ (మాదల), పి.శివమణి (సత్తెనపల్లి), ఎస్‌కే ఎండీ ఇర్ఫాన్ (మాదల), పి.యాసిన్ ఖాన్ (ఇరుకుపాలెం), డి.శివ సాయికృష్ణ (సత్తెనపల్లి), కె.ప్రవీణ్ కుమార్( సత్తెనపల్లి), సిహెచ్ వెంకటేశ్వర్లు( సత్తెనపల్లి), జి.వెంకటేష్, టి.సాయి (మాధల), టి.ఆకాష్ (మాదల) ఎంపికయ్యారు.

# ఆట ముగిసింది... శ్వాస ఆగింది

**స్టేడియంలోనే కుప్పకూలిన షటిల్ ప్లేయర్**



వెంకట రాంబాబు (ఫైల్)

తెనాలి రూరల్: చివరి నిమిషం వరకూ ఆడుతూనే ఉండాలి.. ఆడుతూనే శ్వాస ముగించాలి అని పలుమార్లు సహచర క్రీడాకారులతో పదే పదే చెప్పేవారు ఆయన. అలాగే ఆట ముగిసింది. అదే క్షణంలో శ్వాస ఆగింది. అప్పటి వరకూ ఆటలో పోటీ పడిన ఆయన అదే స్టేడియంలో తుది శ్వాస విడిచారు. తోటి క్రీడాకారులు, కుటుంబ సభ్యులను శోక సంద్రంలో ముంచిన షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పోచిరాజు వెంకట రాంబాబు వివరాలిలా ఉన్నాయి. రూరల్ గ్రామం కొలకలూరుకు చెందిన పోచిరాజు వెంకట రాంబాబు(56) మంచి క్రీడాకారుడు. క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ అంటే అతనికి ప్రాణం. ట్యూషన్ టీచర్‌గా గ్రామంలో జీవితాన్ని ప్రారంభించిన ఆయన తెనాలి వహాబ్ రోడ్డులోని సంస్కార్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా సుదీర్ఘకాలం పనిచేశారు. కాలక్రమంలో పౌరోహిత్యం నేర్చుకుని పురోహితునిగా జీవనం సాగిస్తున్నారు. కొలకలూరులోని కొత్త ఐజక్ శ్యామ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్(కిస్బా) ఉపాధ్యక్షులుగా ఉన్న ఆయన ప్రతి రోజు ఉదయం షటిల్ బ్యాడ్మింటన్ ఆడటం అతని దినచర్యలో భాగం. ఆ క్రమంలో వర్షం కారణంగా కిస్బా కోర్టు జలమయం కావడంతో తెనాలి ఇండోర్ స్టేడియానికి వెళ్లారు. అక్కడ డబుల్స్ గేమ్ ప్రత్యర్థులతో పోటీ పడ్డాడు. ఇరు జట్లు చెరో సెట్ గెలవగా మూడో సెట్‌లో పోటీ పడ్డారు. ఆట ముగిసింది. రెండు జట్లు కోర్టు నుంచి అడుగు బయట పెడుతుండగానే రాంబాబు కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న తోటి క్రీడాకారులు సపర్యలు చేశారు. క్షణాల్లో కూతవేటు దూరంలో ఉన్న తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించడంతో క్రీడాకారులంతా కన్నీటి పర్యంతరమయ్యారు. అప్పటి వరకూ తమతో చలాకీగా ఆడిన మిత్రుడు విగతజీవిగా మారటాన్ని వారు జీర్ణించుకోలేకపోయారు. కుటుంబసభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. ఆయన మృతికి కిస్బా అధ్యక్ష కార్యదర్శులు టి.రవీంద్రబాబు, ఎస్. వినియకుమార్, సభ్యులు కె. జార్జిథామస్, ఎస్‌కే కరీముల్లా, కె. కిరణ్మయి, ఎస్. మురళీధర్, పి.సురేష్ బాబు, కె. శ్రీకాంత్, వసంతరావు, సీహెచ్ నాగరాజు, సత్యనారాయణ, శివ సంతాపం వ్యక్తం చేశారు. వెంకటరాంబాబుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

## ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో మేధకు పదును



ప్రాజెక్టులను తిలకిస్తున్న ప్రొఫెసర్ పార్థసారథి, శ్రీనివాసరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో విద్యార్థుల్లో మేధకు పదును పెట్టవచ్చని కేఎల్ యూనివర్సిటీ బేసిక్ ఫౌండేషన్ ప్రొఫెసర్ పి.పార్థసారథి అన్నారు. ఆదివారం అమరావతి రోడ్డులో యూనివర్సల్ కాన్సెప్ట్ ఆఫ్ మెంటల్ అర్థమెటిక్ సిస్టం(యూసీ మాస్) విద్యార్థులు మెదళ్లకు పదును పెట్టి తయారుచేసిన రోబోటిక్స్ చంద్రయాన్, అగ్రికల్చర్ రోబో, సెల్ఫ్ డ్రైవింగ్ కార్, స్మార్ట్ విలేజ్, కేరమ్ రోబోట్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పార్థసారథి మాట్లాడుతూ చిన్న వయసులోనే రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అబాకస్ వంటి సాంకేతిక విద్యను విద్యార్థులకు నేర్పించడం ద్వారా భవిష్యత్ మేధో సంపన్న శాస్త్రవేత్తలుగా రాణిస్తారని తెలిపారు. శ్రీ రైనా టెక్నాలజీస్ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల చైర్మన్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆధునిక ప్రపంచం భవిష్యత్ సాంకేతిక నైపుణ్యాలతోనే ముడిపడి ఉందని చెప్పారు. యూసీ మాస్ శిక్షణ ద్వారా ఆరేళ్ల వయసు నుంచి 18 ఏళ్ల విద్యార్థుల వరకు రోబోట్ మోడల్స్‌పై కోడింగ్ ప్రోగ్రాంలలో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. రోబోటిక్స్, గణితంలో అబాకస్ మూడు సంవత్సరాల శిక్షణల ద్వారా ప్రత్యేక గ్రాడ్యుయేషన్ విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. వీవీఐటీ ప్రొఫెసర్ డీవీ శేషగిరిరావు, పీపుల్స్ ట్రామా వైద్య నిపుణుడు కె.వెంకటేశ్వరరెడ్డి, విశ్రాంత ఎంఈఓ టీవీ రామిరెడ్డి ప్రాజెక్టులను తిలకించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో యూసీ మాస్ ప్రతినిధి ఎం.శ్రీకాంత్, టెక్నికల్ మోడరేటర్స్ రమ, జీవన పాల్గొన్నారు.

## సోషల్ వెల్ఫేర్ డీడీపై చర్యలు తీసుకోవాలి

లక్ష్మీపురం: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న జిల్లా సోషల్ వెల్ఫేర్ డెప్యూటీ డైరెక్టర్ మధుసూదనరావుపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్‌జీ ప్రభుత్వాన్ని కోరారు. సంబంధిత శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినాన పట్టించుకోలేదని విమర్శించారు. కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు.మధుసూదనరావుపై గతంలో కూడా ఏసీబీ కేసు నమోదు చేసినట్లు గుర్తు చేశారు. కేసు ముగిసే వరకు ప్రధాన బాధ్యతలు ఇవ్వకూడదని నిబంధన ఉన్నా కూడా ఆనాడు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌తో మాట్లాడుకొని సోషల్ వెల్ఫేర్‌తో పాటు బీసీ వెల్ఫేర్, గిరిజన సంక్షేమ శాఖల ఇన్‌చార్జిల బాధ్యతలు తీసుకున్నారని తెలిపారు. నెలలో కనీసం డీడీ 20 హాస్టల్స్ పర్యవేక్షించి విద్యార్థుల సమస్యలు తెలుసుకోవాలని ఆదేశాలు ఉన్నా ఇప్పుడు వరకు ఎన్ని పర్యవేక్షించారని ప్రశ్నించారు. జిల్లా కార్యాలయంలో వారంలో రెండు రోజులు కూడా ఉండరని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీలో పెద్ద అవినీతి జరిగిందని ఆరోపించారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి యశ్వంత్, దుర్గ సాయి, గణేష్, బన్నీ పాల్గొన్నారు.

## ఉప్పలపాడు, గొల్లమూడి మధ్య వంతెన నిర్మాణం

- కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని
- హై లెవెల్ చానల్‌పై కల్వర్టు నిర్మాణానికి ఆదేశాలు

పెదకాకాని: ఉప్పలపాడు వాగు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు చిన్నారులు, ఉపాధ్యాయుని ఘటనపై గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్పందించారు. ఆదివారం గ్రామంలో పర్యటించారు. వాగు వద్ద వంతెన నిర్మాణానికి గాను అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఉప్పలపాడు, గోళ్లమూడి గ్రామాల మధ్య త్వరలో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆయన సూచించారు. నిర్మాణానికి వీవీఐటీ కళాశాల యాజమాన్యం రూ. 50 లక్షలు సహకారం అందిస్తామన్నారని ఈ సందర్భంగా పెమ్మసాని తెలిపారు. అనంతరం వర్షాలకు ఉప్పలపాడులో జరిగిన పంట నష్టాన్ని కూడా ఆయన పరిశీలించారు. హై లెవెల్ చానల్ పొంగి దాదాపు ఐదు వేల ఎకరాలకు పైగా పంట పొలాలు నీట మునిగాయని పెమ్మసాని వద్ద రైతులు వాపోయారు. గతంలో ఉన్న కల్వర్టు కూలిపోయిన తర్వాత తాము అందరం కలిసి తూములు ఏర్పాటు చేసుకున్నా ఉపయోగం లేకుండా పోయిందని చెప్పారు. తక్షణమే స్పందిస్తూ సంబంధిత శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మల్లికార్జునరావుతో పెమ్మసాని ఫోన్లో మాట్లాడారు. కల్వర్టు నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేయాలని తెలిపారు. ఎంపీ నిధుల ద్వారా వీలైనంత త్వరగా కల్వర్టు నిర్మాణాన్ని చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బూసి బాబు, ఎంపీటీసీ సభ్యుడు మోపర్తి శ్రీనివాసరావు, కొరప్రాటి సాంబశివరావు, అప్పాజీ పాల్గొన్నారు.



మృతుల కుటుంబ సభ్యులను కలసి చెక్కును అందజేస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని

**మృతుల కుటుంబాలను పరామర్శించిన మంత్రి**

అనంతరం మృతుల కుటుంబ సభ్యులను మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పరామర్శించారు. స్కూల్ యాజమాన్యం కనీస జాగ్రత్తలు తీసుకో పోవడం కారణంగానే తమ మనవడిని పోగొట్టుకున్నామని చిన్నారి మాన్విక్ అమ్మమ్మ, తాతయ్య కన్నీటి పర్యంతరం అయ్యారు. ప్రభుత్వం ప్రకటించిన ఐదు లక్షల రూపాయల నష్టపరిహారం చెక్కును మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి. కృష్ణకాంత్, గ్రామ సర్పంచ్ కర్నాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతి

పట్నంబజారు: మురుగు కాలువలో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ఆగస్టు 31వ తేదీ రాత్రి భారీ వర్షం నేపథ్యంలో గుర్తుతెలియని సుమారు 50 సంవత్సరాల వ్యక్తి మురుగు కాలవలో పడి మృతి చెందాడు. చుట్టుపక్కల అడిగినప్పటికీ ఎటువంటి ప్రతిఫలం కనబడలేదు. ఈ మేర కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం మార్చురీకి తరలించారు. మృతుడు వివరాలు తెలిసినవారు 8688831325కు సమాచారాన్ని అందించాలని తెలిపారు.